
ఉత్పత్తులతో సామాజికవేత్త సుశీల బొకాడియా, నమిత జైన్, కంచన్ అగర్వాల్

తాజ్‌కృష్ణాలో సూత్ర ఫ్యాషన్ లైఫ్ స్టైల్ ప్రదర్శన

బంజారాహిల్స్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ తాజ్‌కృష్ణాలో ఆధునిక. సంప్రదాయ మేళవింపు కలగలిపిన సూత్ర ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌ను సామాజికవేత్త సుశీల బొకాడియ మంగళవారం ప్రారంభించారు. ఆమెతో పాటు నమిత జైన్, కంచన్ అగర్వాల్, మంజు అగర్వాల్, కవితా జైన్, మమత గుప్తా, పాయల్ కూడా ప్రారంభోత్సవంలో ఉన్నారు. ఈ సందర్భంగా సుశీల మాట్లాడుతూ డిజైనర్‌లు పండుగలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక కలెక్షన్‌లను ప్రదర్శనలో ఉంచారన్నారు. ప్రదర్శనలో 70 స్టాల్స్‌లలో 25 వేలకు పైగా ఉత్పత్తులను అందుబాటులో ఉంటాయని, దసరా, దీపావళికి షాపింగ్ అనుభూతిని కలిగించే ప్రత్యేకమైన ఫ్యాషన్ ఫెస్టివల్ కలెక్షన్స్, భారతీయ దుస్తులు, డిజైనర్, వెస్ట్రన్ వేర్, ఇండియన్ అప్పారెల్, హ్యాండ్లూమ్స్, కాస్ట్యూమ్-డిజైనర్ జ్యువెలరీతో పాటు గృహోపకరణాలు ప్రదర్శనలో అందుబాటులో ఉంచినట్టు సూత్ర నిర్వాహకులు ఉమేష్ తెలిపారు. ఈ నెల 3 వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు.

బంధువునంటూ ఫోన్ చేసి వృద్ధురాలి నుంచి రూ.50 వేలు కాజేత

యూసుఫ్‌గూడ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బంధువులా ఫోన్ చేసి ఓ వృద్ధురాలి నుంచి రూ.50 వేలు కాజేసిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్‌నగర్‌లో నివాసం ఉండే నిర్మలదేవికి గత నెల 29వ తేదీ బంధువులా ఓ యువతి ఫోన్ చేసింది. అత్తమ్మ నాకు ఆన్‌లైన్ పని చేయటంలేదు రూ.50 వేలు గూగుల్ పే చేయమని అడిగింది. ఫోన్ చేసిన వ్యక్తి తన సమీప బంధువులా ఉండటంతో ఆమెకు ఎలాంటి అనుమానం రాలేదు. ఆమె కోరినట్లు రూ.50 వేలు గూగుల్ పే చేసింది. అనంతరం బంధువులకు ఫోన్ చేసి డబ్బులు వచ్చాయా అని అడగటంతో వారు మేము ఫోన్ చేయలేదని తెలిపారు. దీంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇల్లు అమ్ముతానని మోసం

యూసుఫ్‌గూడ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇల్లు అమ్ముతానని ఓ మహిళను నమ్మించి నగదు తీసుకుని మోసం చేసిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఇలా ఉన్నాయి. కళ్యాణ్‌నగర్‌లో నివాసం ఉండే జి.అఖిల ప్రవేట్ ఉద్యోగం చేస్తుంది. ఆమె సొంత ఇంటి కోసం డబ్బు దాచుకుంది. నాగేశ్వరరావు అనే బ్రోకర్‌కు తనకు ఇల్లు కావాలని తెలిపింది. అతను ఓ ఇంటిని చూపించి కోటి ముప్పై లక్షలకు ఇస్తారని, ఓనర్ లోన్ కూడా ఇప్పిస్తాడని చెప్పాడు. దీంతో ఆమె తన తండ్రి కష్టాచారితో కలిసి బ్రోకర్ చూపించిన ఇంటికి వెళ్లి ఓనర్ గిరీష్‌ను కలిసి రూ.90 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఇస్తామని బేరమాడారు. గిరీష్ తనకు రూ.25 లక్షలు టోకెన్ అడ్వాన్స్ ఇస్తే 30 రోజుల్లో లోన్ శాంక్షన్ చేయిస్తానన్నాడు. దీంతో ఆమె మే 25వ తేదీ తన తల్లిదండ్రులతో కలిసి గిరీష్ ఇంటికి వెళ్లి అశోక్ చౌదరి, సామల నాయక్, బ్రోకర్ నాగేశ్వరరావుల సమక్షంలో నగదు ఇచ్చింది. ఆ సమయంలో గిరీష్ అగ్రిమెంట్ కూడా రాశాడు. కానీ ఎన్ని నెలలు గడిచినా లోన్ ఇప్పించలేదు. దీంతో ఆమె లోన్ గురించి అడిగి ఇంటి డాక్యుమెంట్‌లు తీసుకుని బ్యాంకుకు వెళ్లింది. బ్యాంకు మనేజర్ డాక్యుమెంట్‌లు పరిశీలించి ఈ ఇంటికి బీఆర్ఎస్ లేదని, అనుమతి లేకుండా నిర్మాణం చేశారని, లోన్ ఇవ్వటం కుదరదని తెలిపాడు. దీంతో ఆమె గిరీష్ ఇంటికి వెళ్లి నిలదీయగా గిరీష్ తన స్నేహితులు అశోక్‌చౌదరి, సామల నాయక్‌లను పిలిచి ఆమెను దుర్భాషలాడాడు. డబ్బు ఇచ్చేదిలేదని బెదిరించి పంపాడు. దీంతో మోసపోయానని గ్రహించిన ఆమె మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

యూసుఫ్‌గూడ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మధురానగర్‌లో వ్యభిచారగృహంపై పోలీసులు దాడిచేసి నిర్వాహకురాలని అరెస్ట్ చేశారు. మధురానగర్ జి-బ్లాక్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నారని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆ నివాసంపై దాడి చేశారు. ఆ సమయంలో ఓ మహిళ ఇంట్లో ఉంది. పోలీసులు ఇంటిని సోదా చేసి ఆమె వివరాలు అడగ్గా ప్రభాకర్‌రెడ్డి అనే వ్యక్తి ద్వారా ఓ యువతితో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు అంగీకరించింది. కోల్‌కతాకు చెందిన రాజు, స్థానికంగా ఉండే సబ్ నిర్వాహకుడు ప్రభాకర్‌రెడ్డిలు సదరు యువతికి ప్రతి నెలా రూ. 60 నుంచి 70వేలు వరకు ఇస్తారని, తనకు ప్రతి రోజూ రూ.2 వేలు ఇస్తారని వివరించింది. ప్రభాకర్‌రెడ్డి తాను సినిమా రంగంలో పని చేస్తామని తెలిపింది. పోలీసులు ఇంటిని సోదా చేయగా ఓ యువతి కనిపించింది. పురుషులు ఎవరూ లేరు. గదిలో ఉన్న కండోమ్ ప్యాకెట్‌లు, ఫోన్‌లు సీజ్ చేసి నిర్వాహకురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


దొంగతనం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

శ్మశానవాటికలో చోరీ

బోరబండ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వీకర్ సెక్షన్, సైట్-3 లోని విద్యుత్ దహన వాటికలో చోరీ జరిగింది. బోరబండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సైట్-3 శ్మశాన వాటికలో విద్యుత్ దహన వాటికలోని గ్యాస్ పైపులైన్, వాల్స్ పంపులు, మోటర్స్, కంట్రోల్ ప్యానల్ చోరీ అయ్యిందని జీహెచ్ఎంసీ ఏఈ భరత్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఈ ఫిర్యాదు మేరకు చోరీ జరిగిన ప్రాంతాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్ఎంపీ వైద్యుడి భార్య హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం

బంజారాహిల్స్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీ వైద్యుడి భార్య హత్య కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించడంతో పాటు సెల్‌ఫోన్ సిగ్నల్స్‌ను విశ్లేషిస్తున్నారు. ఎల్లారెడ్డిగూడ నవోదయకాలనీలో నివసించే ఆర్ఎంపీ వైద్యుడు ఉమామహేశ్వరరావు భార్య సుధారాణి(44) సెప్టెంబర్ 30 రాత్రి 8 గంటల ప్రాంతంలో దారుణంగా హత్యకు గురైంది. గుర్తు తెలియని వ్యక్తులు ఆమె గొంతు కోసి చంపేసి పారిపోయారు. ట్యూషన్‌కు వెళ్లి వచ్చిన ఆమె పిల్లలు తల్లి రక్తమడుగులో పడిఉన్న తల్లిని చూసి విషయాన్ని తండ్రికి చెప్పారు. ఉమామహేశ్వరరావు సమాచారం మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు జాగిలాలను రంగంలోకి దించడంతో పాటు క్లూ టీంతో ఆధారాలు సేకరించారు. ఇంట్లో పరిశీలించగా మృతిరాలి మెడపై ఉన్న బంగారంతో పాటు కప్‌బోర్డులో ఉన్న నగలు కూడా కనిపించలేదు. సుమారు 15 తులాల బంగారు ఆభరణాలు కనిపించడం లేదని ఉమామహేశ్వరరావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో బంగారం కోసం హత్య జరిగిందా లేదా ఇంకేదైన కారణం ఉందా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. సీసీ కెమెరాలు పరిశీలించగా హత్యకు ముందు ఓ వ్యక్తి బ్యాగు తగిలించుకొని వచ్చినట్టు కనిపించింది. కొద్ది సేపటి తరువాత బ్యాగు, సూట్‌కేసుతో బయటకు వచ్చినట్టు తేలింది. ఈ నిందితుడు ఎవరు అనే దానిపై పోలీసులు దృష్టి సారించారు. హతురాలు సుధారాణి ఫోన్‌ను స్వాధీనం చేసుకొని అందులో ఉన్న నంబర్లు, వాటి సిగ్నల్స్ ద్వారా ఆరా తీస్తున్నారు. ఓ పోలీసు బృందం నగరంలోని ఇతర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. సీసీ కెమెరాల ద్వారా నిందితుడి ఫొటోను పాత నేరస్థులతో సరిపోలుతుందా అని పరిశీలిస్తున్నారు.

ప్రైవేట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి

కవాడిగూడ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బడ్జెట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె శ్రీకాంత్‌రెడ్డి కోరారు. మంగళవారం స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌ను కలిశారు. ప్రైవేట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించి కార్పొరేట్ పాఠశాలలను నియంత్రించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ట్రస్మా గౌరవ అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి. అధికార ప్రతినిధి చింతల రాంచందర్, పి.రామనర్సయ్య పాల్గొన్నారు.

ప్రతిపాదనలకే పరిమితమైన

ఆధునిక వైకుంఠ ధామం


ఆధునిక వైకుంఠ ధామం నమూనా


నిరుపయోగంగా విద్యుత్ దహన వాటిక

● నిధులు మంజూరైనా పనులు ప్రారంభించని అధికారులు

సనత్‌నగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎంతో ఆర్భాటంగా ప్రచారాలతో మొదలు పెట్టిన ఈఎస్ఐసీ శ్మశాన వాటిక అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. నిధులున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయింది. విద్యుత్ దహన వాటిక నిరుపయోగంగా మారింది. ఆధునికి వైకుంఠ ధామం నమూనా కాగితాలకే పరిమితం అయింది. కరోనా తర్వాత ఈఎస్ఐసీ సత్యహరిచంద్ర శ్మశాన వాటికను మోడల్ వైకుంఠ ధామంగా మార్చేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. అత్యాధునిక దహన వాటికలు, ఎలక్ట్రిక్ దహన వాటిక, అంత్యక్రియలకు హాజరయ్యే వారికి అవసరమైన సదుపాయాలు, వేచిఉండే చోటుతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని రూపొందించేలా ప్రాజెక్ట్‌ను తయారు చేశారు. ఆధునికి వైకుంఠ ధామంగా మార్చేందుకు ప్రతిపాదనలు అందమైన నమూనాను జీహెచ్ఎంసీ రూపొందించింది. ఈ ప్రతిపాదన ప్రస్తుతం కాగితాలకే పరిమితమైంది. గత ప్రభుత్వ హయాంలో ఈఎస్ఐ శ్మశాన వాటికను అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వివిధ అధికారులతో కలిసి ప్రతిపాదనలు రూపొందించారు. దానికి ఆమోదం కూడా లభించడంతో వెంటనే పనులను ప్రారంభించాలని ఆదేశించారు. ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు రూ. 5 కోట్ల నిధులు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఏడాదిన్నర లోపు ప్రాజెక్ట్ పూర్తవుతుందని తెలిపారు. ఈ పనుల కోసం రూ.2 కోట్ల నిధులు మంజూరైనా ఇప్పటి వరకు అధికారులు పనులు ప్రారంభించలేదు. సౌకర్యాలు లేకపోవడంతో కొందరు జూబ్లీహిల్స్, పంజాగుట్ట శ్మశాన వాటికలకు వెళుతున్నారు.

నిరుపయోగంగా విద్యుత్ దహన వాటిక

కాలుష్య రహితంగా దహన సంస్కారాలను నిర్వహించేందుకు ప్రత్యేకంగా ఈఎస్ఐ శ్మశాన వాటికలో విద్యుత్ దహన వాటికను ఏర్పాటు చేశారు. సరైన నిర్వహణ లేక విద్యుత్ దహన వాటిక నిరుపయోగంగా మారింది. ఎవరూ లేని అనాథ మృతదేహాల అంత్యక్రియల కోసం 2012లో జీహెచ్ఎంసీ ఈ విద్యుత్ దహన వాటికను నిర్మించింది. కొన్నాళ్లపాటు ఛాతీ, మానసిక చికిత్సాలయంతోపాటు నగరంలో అభ్యమైన అనాథ శవాలకు ఇక్కడ అంత్యక్రియలు నిర్వహించేవారు. కానీ ప్రస్తుతం నిర్వహణ లోపంతో మూలనపడింది. ఇప్పటికైనా అధికారులు పనులను ప్రారంభించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

అత్యవసర సమయంలో సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడవచ్చు


సీపీఆర్ ఎలా చేయాలో విద్యార్థినితో చేయిస్తున్న జవహర్ బాల్ మంచ్ ప్రతినిధి

యూసుఫ్‌గూడ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో చిన్నా పెద్దలేకుండా అన్ని వయస్సుల వారికి గుండె పోటు రావటం సాదారణమైంది. ఈ నేపథ్యంలో విద్యార్థులంతా ప్రథమ చికిత్సతోపాటు సీపీఆర్ చేయటం నేర్చుకోవటంతో గుండె పోటు వచ్చిన వారిని ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడ వచ్చని జవహర్ బాల్ మంచ్ ఛైర్మన్ మామిడి రిషీకేశ్‌రెడ్డి అన్నారు. జవహర్ బాల్ మంచ్ ప్రతినిధులు మంగళవారం వెంకటగిరిలోని గుడ్‌సిటిజన్స్ కాన్సెప్ట్ స్కూల్‌లో ప్రథమ చికిత్స చేయటం, గుండెపోటు వచ్చిన వారికి సీపీఆర్ చేసే పద్ధతులు వివరించారు. వైద్యులు రవికుమార్, వెంకటేశ్వర్లు విద్యార్థులకు వివరిస్తూ వారితో చేపిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ నసీం ఉన్నీసా, ప్రిన్సిపాల్ అయుఖాన్ తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ

అమీర్‌పేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో జరుగనున్న శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని వేడుకలకు సంబంధించిన పూర్తి సమాచారంతో కూడిన కరపత్రాన్ని దేవాలయం ఈవో బొల్లంపల్లి కృష్ణ, చైర్మన్ సాయిబాబా గౌడ్‌తో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు అమ్మవారు ఏయే రోజుల్లో ఎటువంటి అలంకరణలతో దర్శనం ఇస్తారనే విషయాలతో పాటు చండీహోమం, ప్రత్యేక పూల అలంకరణ, సామూహిక శ్రీ లక్ష్మి కుంకుమార్చన, మహా పూర్ణహుతి, ప్రత్యేక శాంతి హోమం, ప్రత్యేక వాహన పూజలకు సంబంధించిన వివరాలతో కూడిన సమాచారం ఈ కరపత్రం ద్వారా భక్తులకు అందుబాటులోకి రానుంది. దసరా నవరాత్రుల్లో విశేష పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని ఈవో కృష్ణ కోరారు.

పంజాగుట్ట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ జీటీఎస్ కాలనీలోని శ్రీ వీరాంజనేయ భవానీ శంకర అయ్యప్పస్వామి సాయిబాబా దేవస్థానంలో అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు శ్రీ భవానీ దేవి శరన్నవరాత్రులు, దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి దేవాదాయశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.


ఇళ్లను సర్వే చేసేందుకు వచ్చిన జీహెచ్ఎంసీ సర్కిల్-19 ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటకృష్ణ

కమలానగర్‌లో 'డబుల్' ఇళ్ల సర్వే

యూసుఫ్‌గూడ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కమలానగర్ డబుల్ బెడ్‌రూమ్ నివాసాల వద్ద మంగళవారం మళ్లీ లబ్ధిదారులు వాగ్వాదం చేసుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల తరువాత జీహెచ్ఎంసీ సర్కిల్–19 ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటకృష్ణ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్దకు వచ్చారు. అప్పటికే ఎవరైనా వస్తారనే ఉద్దేశంలో స్థానికులు గుమికూడి ఉన్నారు. అక్కడకు వచ్చిన అధికారి వెంకటకృష్ణ ఇళ్లను పరిశీలించి రిపోర్ట్ పంపేందుకు వచ్చానని తెలిపారు. ఇక్కడున్న లబ్ధిదారులకు ఇళ్లు ఇచ్చిన తరువాత మిగిలినవి ఎవరికైనా ఇచ్చుకోండి అంటూ అధికారితో మాట్లాడుతుండగ కొందరు లబ్ధిదారులు వచ్చి ఈ ఇళ్లపై హైకోర్టులో కేసు ఉందని వివరించబోయాడు. దీంతో స్థానికులు కోర్టులో ఉంటే కోర్టులో చూసుకో అంటూ వాగ్వాదం మొదలు పెట్టారు. ఇంతలో అధికారి వెంకటకృష్ణ పోలీసులకు సమాచారం ఇవ్వటంతో పోలీసులు సంఘటన స్థలానికి వచ్చారు. అప్పటికే వాదులాడుకున్న వారు సద్దుమణిగారు.

అప్పుల బాధతో ఆర్టీఏ ఏజెంట్ ఆత్మహత్య

అల్వాల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అల్వాల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హస్మత్‌పేట్ ప్రాంతానికి చెందిన సతీష్‌కుమార్(40) పదేళ్లుగా ఆర్టీఏ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో తెలిసిన వారి వద్ద అప్పు చేశాడు. అప్పు ఇచ్చిన వారు డబ్బు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. సోమవారం రాత్రి భోజనం చేసిన తర్వాత భార్యతో మాట్లాడి తన గదిలోకి వెళ్లి నిద్రపోయాడు. సతీష్‌కుమార్ మంగళవారం ఉదయం తలుపులు తెరవకపోవడంతో కుటుంబ సభ్యులు బలవంతంగా తెరిచి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని వేలాడుతూ ఉన్నాడు. సోదరుడు సంతోష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జ్వరాల కేసుల పరిశీలన

● ప్రభుత్వ ఆస్పత్రులను సందర్శించిన వైద్యాధికారులు


ఉస్మానియా ఆస్పత్రిలో వివరాలు సేకరిస్తున్న వైద్యాధికారులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో జ్వరాల తీవ్రతను పరిశీలించడానికి వైద్యాధికారులు ఆస్పత్రులను సందర్శించారు. మంగళవారం గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, ఏరియా ఆస్పత్రులలో పర్యటించారు. సీజనల్ కేసులు ఎన్ని ఉన్నాయి, వైద్యులు, సిబ్బంది, నర్సులు, మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉస్మానియా ఆస్పత్రిని తెలంగాణ వైద్య విధాన పరిషత్ అజయ్‌కుమార్, హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటీ సందర్శించారు. ఉదయం 10.30 గంటలకు ఆస్పత్రికి వెళ్లిన అధికారులు మధ్యాహ్నం వరకు వార్డులను తిరిగి ఓపీ, ఐపీలో జ్వరాల కేసులను పరిశీలించారు. డెంగీ, చికున్‌గున్యా, వైరల్ ఫీవర్ల వివరాలు తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి మందులు ఇస్తున్నారా.. చికిత్స సక్రమంగా చేస్తున్నారని అని అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీ, బ్లడ్ బ్యాంక్, బయోమెడికల్‌ను సందర్శించారు. బడ్జెట్, వైద్యుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్, ఆర్ఎంఓ డాక్టర్ జయకృష్ణ పాల్గొన్నారు. గాంధీ ఆస్పత్రిని టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్ సందర్శించారు. అక్కడి పరిస్థితులను సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి ఆయనకు వివరించారు. నిలోఫర్ ఆస్పత్రిని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్వీ కర్ణన్ సందర్శించి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నాంపల్లి ఏరియా, కుత్బుల్లాపూర్ ఆస్పత్రులను కూడా అధికారులు సందర్శించారు.

పురుగులమందు తాగిన వారిలో ఒకరి మృతి

● కుటుంబం ఆత్మహత్యాయత్నంలో మరో నలుగురు ఆస్పత్రిలోనే..

● మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు బంధువుల నిరాకరణ



దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రుణబారం మోయలేక.. చావే శరణ్యమని భావించి పురుగుల మందు తాగిన ఐదుగురు సభ్యులుగల కుటుంబంలో చిన్న కుమారుడు మృతి చెందాడు. మిగతా నలుగురు కుటుంబ సభ్యుల ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. కర్నూలుకు చెందిన వెంకటేశ్వరప్రసాద్ (60), లత (55) దంపతులకు సందీప్ (30), సాయి స్వరూప్ (28), వంశీకృష్ణ (26)లు ముగ్గురు సంతానం. వెంకటేశ్వర ప్రసాద్ తొమ్మిది సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని కోదండరాం నగర్ కాలనీలో నివాసం ఉంటూ గౌతంనగర్ కాలనీలో ఓ కిరాణ దుకాణం నడిపిస్తున్నాడు. అయితే కిరాణ దుకాణం, కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. అప్పులోళ్ల ఒత్తిడి ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి ఐదుగురు కుటుంబ సభ్యులు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న విషయం విదితమే. సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకున్న సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, ఎస్ఐ మారయ్యలు వారిని హుటాహుటిన ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మృతి

వెంకటేశ్వర ప్రసాద్, లత దంపతుల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ముగ్గురు కుమారులు సందీప్(30), సాయి స్వరూప్(28), వంశీకృష్ణ (26)ల ఆరోగ్యం నిలకడగా ఉందని రాత్రి వెల్లడించారు. అయితే తెల్లవారుజామున ఒక్కసారిగా వంశీకృష్ణ ఆరోగ్య పరిస్థితి విషమించింది. వైద్య సేవలందించినప్పటికీ ఫలితం లేకపోవడంతో మృతి చెందాడు. మిగిలిన నలుగురి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారని ఎస్ఐ మారయ్య తెలిపారు.

ముందుకు రాని బంధువులు

తల్లిదండ్రులు, సోదరులిద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో మృతి చెందిన వంశీకృష్ణ మృతదేహాన్ని తీసుకువెళ్లేందుకు బంధువులెవరూ ముందుకు రాలేదు. చికిత్స పొందుతున్న వెంకటేశ్వరప్రసాద్ కుటుంబ సభ్యులు తమ బంధువులకు సంబంధించి కర్నూలుకు చెందిన పదిహేను మంది ఫోన్ నెంబర్లను పోలీసులకు ఇచ్చారు. పోలీసులు వారందర్నీ సంప్రదించగా వారు కూడా ఆస్పత్రికి వచ్చేందుకు నిరాకరించారు. చివరకు లత తల్లిదండ్రులతో ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, ఎస్ఐ మారయ్య పలుమార్లు ఫోన్‌లో చర్చించి, వారికి కౌన్సిలింగ్ ఇవ్వడంతో మంగళవారం రాత్రి హైదరాబాద్ వచ్చేందుకు అంగీకరించారు. దీంతో వారు వచ్చే వరకు వంశీకృష్ణ మృతదేహాన్ని మార్చురీలోనే భద్రపరుస్తామని తెలిపారు. వెంకటేశ్వర ప్రసాద్ కుటుంబం సుమారు రూ.25 లక్షల వరకు అప్పులు చేసినట్లు తెలుస్తోంది. అయితే గతంలో కర్నూలులో కిరాణ దుకాణం నిర్వహించగా అక్కడ కూడా అప్పులు కావడంతో నగరానికి వలస వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు.

బేగంపేటలో సమస్యలను పరిష్కరించాలి


గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి

బేగంపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లో సమస్యలపై కార్పొరేటర్ మహేశ్వరి మంగళవారం గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లోని పలు బస్తీలు, కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్ల సమస్యలతో పాటు ద్వారాకాదాస్ కాలనీలో నాలా పూడికతీత పనులు తీయక పోవడంతో నాలా నీరు సమీపంలోని కాలనీలు, బస్తీల్లోకి వస్తుందని, వెంటనే పూడికతీత పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. బ్రాహ్మణవాడిలోని పీఎఫ్ క్వార్టర్స్ వద్ద మురుగునీరు, వర్షంనీరు వెళ్లే అవకాశం లేక నిత్యం ఇక్కడ మురుగు సమస్య ఏర్పడుతుందని పేర్కొన్నారు. పలు బస్తీల్లో సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో తెలిపినట్లు కార్పొరేటర్ మహేశ్వరి తెలిపారు.


ప్రజావాణిలో సమస్యలను తెలుసుకుంటున్న డా. చిన్నారెడ్డి, దివ్య

ప్రజావాణికి 381 దరఖాస్తులు

బేగంపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 381 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని వారు బరోసా ఇచ్చారు. గృహనిర్మాణ శాఖకు చెందినవి 72, ఎస్సీ సంక్షేమ శాఖకు చెందినవి 56, రెవెన్యూ పరమైనవి 51, విద్యుత్ శాఖకు చెందిన వి 40, పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబందించి 28, మైనార్టీ వెల్ఫేర్ శాఖకు చెందినవి 25, ప్రవాసి ప్రజావాణికి 5, ఇతర శాఖలకు సంబందించివి 94 దరఖాస్తులు అందినట్లు ప్రజావాణి అధికారులు తెలిపారు.

బతుకమ్మ సంబురాలు


ఖైరతాబాద్ సరస్వతీ విద్యామందిర్ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినిలు, ఉపాధ్యాయులు

ఖైరతాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ సంబరాలు నగరంలో ప్రారంభమయ్యాయి. పెద్దల అమావాస్య నాడు ఎంగిలిపూల బతుకమ్మలతో ఉత్సవాలు ప్రారంభం కావాల్సివుండగా ఒకరోజు ముందుగానే పాఠశాలల్లో వేడుకలు ప్రారంభించారు. ఖైరతాబాద్ సరస్వతీ విద్యామందిర్ పాఠశాలలో విద్యార్థులకు బతుకమ్మ పండగ గురించి వివరించి విద్యార్థినిలతో కలిసి టీచర్లు బతుకమ్మ, కోలాటం, దాండియా ఆడారు.


నాట్కో పాఠశాల్లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు ఉపాధ్యాయులు

బోరబండ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే పూలతో పూజించే పండుగ బతుకమ్మ పండుగని నాట్కో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గీత అన్నారు. మంగళవారం స్కూల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుపుకున్నారు.


యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు


బతుకమ్మతో సెల్ఫీ కాంటెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు డాక్టర్ ప్రవంతి, డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, గీతానంద్, హేమ

బతుకమ్మతో ముందడుగు సెల్ఫీ కాంటెస్ట్

పంజాగుట్ట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ముందడుగు పౌండేషన్, సేవ్ ద గర్ల్ చైల్డ్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా మీ బతుకమ్మతో సెల్ఫీ కాంటెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు డాక్టర్ జి.స్రవంతి, డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని తెలిపారు. మంగళవారం ఎర్రమంజిల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బతుకమ్మతో సెల్ఫీ కాంటెస్ట్ పోస్టర్‌ను గీతానంద్, హేమలతో కలిసి వారు ఆవిష్కరించారు. తెలంగాణలో బతుకమ్మ పండుగ అంటేనే బాలికలు, యువతులు, మహిళలు ఎంతో అందంగా ముస్తాబై బతుకమ్మ ఆడుతూ సందడి చేస్తారని, మీరు అందంగా ముస్తాబై, మీరు అందంగా తీర్చిదిద్దిన, మీ బతుకమ్మతో సెల్ఫీ పంపండని వారన్నారు. మీ బతుకమ్మతో మీరు పంపిన మీ సెల్ఫీలో మొదటి ఐదుగురిని ఎంపిక చేసి బహుమతులు అందజేస్తామన్నారు.



సికింద్రాబాద్ రేల్వే స్టేషన్‌లోని లేఖా భవన్ మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మాగాంధీ తైలవర్ణ చిత్ర పటం

ఏళ్లయినా చెక్కు చెదరని చిత్ర పటం

చిలకలగూడ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ లేఖా భవన్ మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మా గాంధీ తైల వర్ణ చిత్ర పటం ఏళ్లయినా చెక్కు చెదరలేదు. 1966లో దక్షిణ మధ్య రైల్వే జోన్ ఏర్పడగా, అప్పటి ఉద్యోగులు రూ. 25 పైసల నుంచి రూ. 50 పైసల వరకు చందాలు వేసుకుని దాదాపు రూ. 100లు వెచ్చించి గాంధీ చిత్రపటాన్ని కొనుగోలు ఏర్పాటు చేసినట్టు పదవీ విరమణ చేసిన ఉద్యోగులు చెబుతున్నారు. '19వ శతాబ్దపు ప్రముఖ ఫొటోగ్రాఫర్, ఆర్టిస్ట్ రాజాదీనదయాళ్ ఆసియా ఖండంలోనే అత్యుత్తమ ఫొటోగ్రాఫర్, మంచి చిత్రకారుడని, నైజాం నవాబు ఆస్థాన ఫొటోగ్రాఫర్‌గా నియమింపబడ్డాడు. ఆయన వేసిన అరుదైన తైలవర్ణ చిత్రానికి దాదాపుగా కొన్నేళ్ల పైన చరిత్ర ఉంది. ఆ కాలంలో సికింద్రాబాద్‌లో ఫొటో స్టూడియో నిర్వహించినట్లు' పదవీ విరమణ చేసిన ఉద్యోగి చిత్రకారుడు వినోద్ మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అరుదైన ఈ తైల వర్ణ చిత్రం వెలకట్టలేనిదని దీనిని జాగ్రత్త పర్చాల్సిన అవసరం ఉందని అన్నారు. 1980 ప్రాంతంలో రాజాదీనదయాల్ తీసిన ఫొటోలు, చిత్రాలు గోడలకు వేలాడటం చూసినట్లు గుర్తున్న ఆయన, శ్రద్ధగా వెతికితే అపురూపమైన కళాఖండాలు దొరికే అవకాశం ఉందన్నారు.

డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించండి



కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి

బేగంపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ టి. మహేశ్వరి కోరారు. ఈ మేరకు గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలని కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. డివిజన్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీల్లో రోడ్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ద్వారకాదాస్ కాలనీలో నాలాలో పూడికతీత పనులు చేపట్టాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. బ్రాహ్మణవాడిలోని పీఏఫ్ క్వార్టర్స్ వద్ద మురుగునీరు, వర్షంనీరువెళ్లే అవకాశాలు లేకపోవడంతో నిత్యం ఇక్కడ మురుగు సమస్య ఏర్పడుతుందని వివరించారు. కుందన్‌బాగ్ నుంచి బేగంపేట రైల్వేస్టేషన్ కింద నుంచి మురుగునీరు బ్రాహ్మణవాడిలో ప్రవహిస్తుందని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వినతిలో పేర్కొన్నట్లు కార్పొరేటర్ మహేశ్వరి తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ నేత టి. శ్రీహరి తదితరులు ఉన్నారు.

సివరేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించాలి

● కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్‌లో ఉన్న సివరేజీ, తాగునీటి సమస్యలను పరిష్కారించాలని కార్పొరేటర్ కంది శైలజ కోరారు. మంగళవారం జలమండలి కార్యాలయంలో జీఎం వినోద్‌ను కలిసి డివిజన్‌లో నెలకొన్న వివిధ సమస్యలపై చర్చించారు. పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ లీకేజీ అవుతున్నాయని, కలుషితనీరు సరఫరా అవుతుందని వివరించారు. పెండింగ్‌లో ఉన్న తాగునీటి, సీవరేజీ పైపులైన్ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు.

పురుగులమందు తాగిన వారిలో ఒకరి మృతి

● కుటుంబం ఆత్మహత్యాయత్నం ఘటనలో

● ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరో నలుగురు

దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): రుణభారం మోయలేక..చావే శరణ్యమని భావించి పురుగుల మందు తాగిన ఐదుగురు సభ్యులుగల కుటుంబంలో చిన్న కుమారుడు మృతి చెందాడు. మిగతా నలుగురు కుటుంబసభ్యుల ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. కర్నూలుకు చెందిన వెంకటేశ్వరప్రసాద్ (60), లత (55) దంపతులకు సందీప్ (30), సాయి స్వరూప్ (28), వంశీకృష్ణ (26)లు ముగ్గురు సంతానం. వెంకటేశ్వర ప్రసాద్ తొమ్మిది సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని కోదండరాంనగర్ కాలనీలో నివాసం ఉంటూ గౌతంనగర్ కాలనీలో ఓ కిరాణ దుకాణం నడిపిస్తున్నాడు. అయితే కిరాణ దుకాణం, కుటుంబపోషణ కోసం అప్పులు చేశాడు. అప్పులోళ్ల ఒత్తిడి ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి ఐదుగురు కుటుంబ సభ్యులు పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసుకున్న విషయం విదితమే. సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకున్న సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, ఎస్ఐ మారయ్యలు వారిని హుటాహుటిన ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మృతి

వెంకటేశ్వరప్రసాద్, లత దంపతుల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ముగ్గురు కుమారులు సందీప్(30), సాయిస్వరూప్(28), వంశీకృష్ణ(26) ఆరోగ్యం నిలకడగా ఉందని రాత్రి వెల్లడించారు. అయితే తెల్లవారుజామున ఒక్కసారిగా వంశీకృష్ణ ఆరోగ్య పరిస్థితి విషమించింది. వైద్య సేవలందించినప్పటికీ ఫలితం లేకపోవడంతో మృతి చెందాడు. మిగిలిన నలుగురి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారని ఎస్ఐ మారయ్య తెలిపారు.

మృతదేహాన్ని తీసుకెళ్లాడానికి ముందుకు రాని బంధువులు

తల్లిదండ్రులు, సోదరులిద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో మృతి చెందిన వంశీకృష్ణ మృతదేహాన్ని తీసుకువెళ్లేందుకు బంధువులెవరూ ముందుకు రాలేదు. చికిత్స పొందుతున్న వెంకటేశ్వరప్రసాద్ కుటుంబ సభ్యులు తమ బంధువులకు సంబంధించి కర్నూలుకు చెందిన పదిహేను మంది ఫోన్ నంబర్లను పోలీసులకు ఇచ్చారు. పోలీసులు వారందర్ని సంప్రదించగా వారు కూడా ఆస్పత్రికి వచ్చేందుకు నిరాకరించారు. చివరకు లత తల్లిదండ్రులతో ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, ఎస్ఐ మారయ్య పలుమార్లు ఫోన్‌లో మాట్లాడి కౌన్సెలింగ్ ఇవ్వడంతో మంగళవారం రాత్రి హైదరాబాద్ వచ్చేందుకు అంగీకరించారు. వారు వచ్చే వరకు వంశీకృష్ణ మృతదేహాన్ని మార్చురీలోనే భద్రపరుస్తామని తెలిపారు. వెంకటేశ్వర ప్రసాద్ కుటుంబం సుమారు రూ.25 లక్షల వరకు అప్పులు చేసినట్లు తెలుస్తోంది. అయితే గతంలో కర్నూలులో కిరాణ దుకాణం నిర్వహించగా అక్కడ కూడా అప్పులు కావడంతో నగరానికి వలస వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు.

ప్రతిపాదనలతో సరిపెట్టారు

నిరుపయోగంగా ఈఎస్ఐ శ్మశాన వాటిక

● ముందుకు సాగని వైకుంఠ ధామం పనులు

● రూ. 5 కోట్లతో మోడరన్ శ్మశానవాటికకు ప్రణాళికలు

● రూ. 2 కోట్ల నిధుల మంజూరు

● అయినా పనులను ప్రారంభించని అధికారులు

సనత్‌నగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎంతో ఆర్భాటంగా మొదలు పెట్టిన ఈఎస్ఐసీ శ్మశానవాటిక అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. విద్యుత్ దహన వాటిక నిరుపయోగంగా మారింది. మోడరన్ వైకుంఠధామం కాగితాలకే పరిమితం అయింది. కరోనా తర్వాత ఈఎస్ఐసీ సత్యహరిచంద్ర శ్మశానవాటికను మోడల్ వైకుంఠ ధామంగా మార్చేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. అత్యాధునిక దహన వాటికలు, ఎలక్ట్రిక్ దహనవాటిక, అంత్యక్రియలకు హాజరయ్యే వారికి శ్మశాన వాటికలో అవసరమైన సదుపాయాలు కల్పించి మోడరన్ వైకుంఠ ధామంగా మార్చేందుకు ప్రతిపాదనలు అందమైన నమూనాను జీహెచ్ఎంసీ రూపొందించింది. ఈ ప్రతిపాదన ప్రస్తుతం కాగితాలకే పరిమితమైంది. గత ప్రభుత్వ హయాంలో ఈఎస్ఐ శ్మశానవాటికను అభివృద్ధి చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వివిధ అధికారులతో కలిసి ప్రతిపాదనలు రూపొందించారు. దానికి ఆమోదం కూడా లభించడంతో వెంటనే పనులను ప్రారంభించాలని ఆదేశించారు. ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు రూ. 5 కోట్లనిధులు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఈ పనుల కోసం రూ. 2 కోట్ల నిధులు మంజూరు కూడా చేశారు. ఏడాదిన్నరలోపు ప్రాజెక్ట్ పూర్తి చేస్తామన్న అధికారులు నేటికీ పనును ప్రారంభించలేదు.

శ్మశాన వాటికలో అన్నీ సమస్యలే

ఏడున్నర ఎకరాల్లో ఉన్న ఈఎస్ఐసీ శ్మశానవాటికలో అన్నీ సమస్యలే. ఎన్నో ఏళ్ల క్రితం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన దహనవాటికలు తప్ప ఎటువంటి అభివృద్ధి జరగలేదు. కోవిడ్ సమయంలో వివిధ ఆస్పత్రుల నుంచి మృతదేహాలను తీసుకువచ్చి ఇక్కడ దహనం చేశారు. స్థలాభావంతో దహనవాటికల్లో కాకుండా కిందకూడా దహన సంస్కారాలు చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా చర్చంశనీయంగా మారింది. దాంతో ఎమ్మెల్యే తలసాని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మోడల్ శ్మశానవాటికలా మార్చేందుకు తగిన ప్రణాళికలు రూపొదించారు. ఆ ప్రణాళికలు కాగితాలకే పరిమితం అయ్యాయి. శ్మశాప వాటిలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదు. దహన సంస్కారాలకు వచ్చిన బంధువులు జూబ్లీహిల్స్, పంజాగుట్ట శ్మశాన వాటికలకు వెళుతున్నారు.



మోడరన్ వైకుంఠథామం నమూనా



నిర్వహణా లోపంతో...

కాలుష్యరహితంగా దహన సంస్కారాలను నిర్వహించేందుకు ప్రత్యేకంగా ఈఎస్ఐ శ్మశానవాటికలో విద్యుత్ దహన వాటికను ఏర్పాటు చేశారు. కోట్లాది ఖర్చుతో అందుబాటులోకి తెచ్చిన దహనవాటిక సరైన నిర్వహణలేక నిరుపయోగంగా మారింది. అనాథ మృతదేహాల అంత్యక్రియల కోసం 2012లో జీహెచ్ఎంసీ ఈ విద్యుత్ దహన వాటికను నిర్మించింది. కొన్నాళ్లపాటు ఛాతీ, మానసిక చికిత్సాలయంతోపాటు నగరంలో అభ్యమైన అనాథ శవాలకు ఇక్కడ అంత్యక్రియలు నిర్వహించేవారు. ప్రస్తుతం నిర్వహణా లోపంతో అది మూలనపడింది. ఇప్పటికైనా అధికారులు పనులను ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

హెల్ప్ ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో 'జనరేషన్ టు గెదర్'



సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న హెల్ప్ ఏజ్ ఇండియా సభ్యులు

తార్నాక, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): హెల్ప్ ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో తార్నాకలోని మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో అంతార్జాతీయ వృద్ధుల దినోత్సవంలో భాగంగా 'జనరేషన్ టు గెదర్' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ సభ్యులు పలువురు వృద్ధుల(సీనియర్ సిటిజన్స్)కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ప్రజా ఆలోచనా వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు వేపూరి గోపాలరావు, ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎస్. శ్రీధర్ ముఖ్య అతిధులుగా పాల్గొని ప్రసగించారు. వృద్ధుల నుంచి యువకులు విలువైన జీవిత పాఠాలు నేర్చుకోవలన్నారు. సంఘటిత సమాజాన్ని నిర్మించడానికి మారుతున్న డిజిటల్ ప్రపంచానికి అనుగుణంగా తరాల మధ్య బలమైన సంబంధాల ఆవశ్యకతను వివరించారు. హెల్ప్ ఏజ్ ఇండియా సీఈవో రోహిత్ ప్రసాద్ మాట్లాడుతూ యువతకు పెద్దలకు మధ్య సంభాషణ గౌరవాన్ని, సహకారాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో వివిధ సంస్థల భాగస్వాములతో కలిసి పని చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో హెల్ప్ ఏజ్ ఇండియా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ టెరిటరీ హెడ్ యతేంద్ర యాదవ్, మేనేజర్ వి. సుభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బధిరులకు టెలీమెడిసిన్ సెంటర్

ప్రారంభించిన కిమ్స్ ఆస్పత్రి సీఎండీ బొల్లినేని భాస్కరరావు



ఇంటర్‌ప్రెంటర్లతో డాక్టర్ భాస్కర్‌రావు తదితరులు

రాంగోపాల్‌పేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పాక్షిక బధిరులమని, మనకు చెవులు ఉన్నా.. కావల్సింది మాత్రమే వింటామని కిమ్స్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ పీజీ రోడ్డులోని కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసర్చ్ సెంటర్ (కేఎఫ్ఆర్‌సీ)లో బధిరుల కోసం ఏర్పాటు చేసిన టెలీమెండిసిన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ భారతదేశంలో దాదాపు 18 లక్షల మందికి పైగా వినికిడి లోపంతో బాధపడుతున్నారని, వారు ముఖ్యంగా వైద్యనిపుణులతో మాట్లాడేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మన దేశంలో సర్టిఫైడ్ ఇండియన్ సైన్ లాంగ్వేజెస్ ఇంటర్‌ప్రెంటర్లు కేవలం 300 మంది మాత్రమే ఉన్నారన్నారు. అత్యవసర వైద్యసేవలు పొందడంలో బధిరులు తమ సమస్య ఏంటన్న విషయాన్ని వైద్యులకు చెప్పలేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కేఎఫ్ఆర్‌సీ అధ్వర్యంలో బధిరుల కోసం టెలీమెడిసిన్ సెంటర్‌ను ప్రారంభించామన్న ఆయన, అత్యాధునిక వీడియో ఇంటర్‌ప్రెజేంటేషన్ సిస్టంఅందుబాటులోకి తేవడం ద్వారా బధిరులకు వైద్యులకు మధ్య ఈఎస్ఎల్ కమ్యూనికేషన్‌కు వీలు కల్పిస్తుందన్నారు. డీఈఎఫ్ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు సందీప్ మాట్లాడుతూ డెఫ్ ఎనేబుల్డ్ ఫౌండేషన్ కేఎఫ్ఆర్‌సీ భాగస్వామ్యంతో నెలకొల్పడంపై హర్షం వ్యక్తం చేశారు. బధిరులకు వైద్యసేవలు అందించడంలో ఇది ఓ పెద్ద ముందడుగన్నారు. కార్యక్రమంలో కేఎఫ్ఆర్‌సీ చైర్మన్ డాక్టర్ భుజంగరావు, న్యూరాలజిస్ట్ డాక్టర్ సుభాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్ గౌడ్

బౌద్ధనగర్, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్ గౌడ్ ఆరోపించారు. మంగళవారం బౌద్ధనగర్ డివిజన్ న్యూఅశోక్‌నగర్‌లో స్థానిక నాయకులతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్సిగుట్ట న్యూఅశోక్‌నగర్ వీరాంజనేయస్వామి ఆలయం వద్ద పేరుకుపోయిన చెత్తను స్థానికులు చూపించారు. రవిప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ బౌద్ధనగర్ డివిజన్‌లో సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, ప్రజాపతినిధులు పట్టించుకోకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మహిళా మోర్చా నాయకురాలు అమరావతి ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో బస్తీకమిటీ అధ్యక్షుడు ఓములు, జాయింట్ కన్వీనర్ దత్తు, సతీష్ నేత, బైరి సురేష్, వేంకటేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో 2కేఎం మారథాన్

సికింద్రాబాద్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతాహి సేవలో భాగంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో మంగళశారం 2 కేఎం మారథాన్ నిర్వహించారు. సిక్ విలేజీ, దోబీఘాట్ పరిసర ప్రాంతాలలో మారథాన్ వాక్ నిర్వహించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీఈవో మధుకర్ నాయక్, జాయింట్ సీఈవో పల్లవి విజయ్‌వంశీ పాల్గొన్నారు. శానిటేషన్ సూపరింటెండెంట్ దేవేందర్, ఏ. మహేందర్, రాజ్‌కుమార్, కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, మల్లికార్జున్ తదితరులు స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

'విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి'

బౌద్ధనగర్, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ప్రిన్సిపాల్ రామచంద్ర సూచించారు. సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీకాలేజీలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు వీడ్కోలు, ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఫ్రెషర్స్ వేడుకలను మంగళవారం స్థానికంగా మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలులో నిర్వహించారు. కాలేజీలో చేరిన నూతన విద్యార్థులకు స్వాగతం పలికారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు వీడ్కోలు పలికారు. విద్యార్థులు సన్మార్గంలో నడుస్తూ, భవిష్యతులో ఉన్నతమైన స్థానంలో నిలబడాలని ప్రిన్సిపాల్ సూచించారు.

సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెడుతున్న వారిని అరెస్ట్ చేయాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్

తార్నాక, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెడుతున్న వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. బీసీ మహిళా మంత్రి కొండా సురేఖ మనోభావాలు దెబ్బతినేలా ఇటీవల కొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని ఆయన గుర్తు చేశారు. మంగళవారం తార్నాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా మెదక్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మెదక్ ఎంపీ బహూకరించిన నూలుమాలను వక్రీకరిస్తూ బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం సోషల్ మీడియాలో ట్రోల్ చేసిందన్నారు. ప్రభుత్వం వెంటనే అసభ్యకరంగా ప్రచారం చేస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అన్నారు.

భద్రతా లోపాలపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు

● దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్

హైదరాబాద్, అక్టోబర్ 1 (ఆంధ్రజ్యోతి): రైళ్ల కార్యకలాపాలల్లో నిరంతర తనిఖీలు అవసరమని, తనిఖీల్లో భద్రతపరంగా లోపాలు గుర్తించిన పక్షంలో తక్షణం సరిదిద్దడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్‌జైన్ అధికారులను ఆదేశించారు. సెప్టెంబరు నెలలో అధికారులు సూపర్‌వైజర్లు నిర్వహించిన సుమారు 1200 భద్రతా తనిఖీలకు సంబంధించిన నివేదికను పరిశీలించారు. దక్షిణమధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్‌తో కలిసి మంగళవారం సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్ డివిజన్లకు చెందిన డివిజనల్ రైల్వే మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైళ్ల కార్యకలాపాల భద్రతా చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ ప్రతి నెలా అధికారులు, సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయి భద్రతా తనిఖీలను మరింత పెంచాలన్నారు. ప్రధానంగా రైళ్లు సజావుగా నడపడానికి సురక్షితమైన పనిపద్ధతులను కచ్చితంగా పాటించాలన్నారు. భద్రతకు సంబంధించిన సిగ్నలింగ్, ఇంజినీరింగ్ పరికరాలు స్టేషన్ ఆస్తులు మొదలైన వాటి లభ్యత, పనితీరుపై దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. సిబ్బందికి సరైన విశ్రాంతి ఉండేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.



ఉస్మానియా ఆస్పత్రిలో వివరాలు సేకరిస్తున్న వైద్యాధికారులు

జ్వరాల కేసుల పరిశీలన

● ప్రభుత్వ ఆస్పత్రులను సందర్శించిన వైద్యాధికారులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో జ్వరాల తీవ్రతను పరిశీలించడానికి వైద్యాధికారులు ఆస్పత్రులను సందర్శించారు. మంగళవారం గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, ఏరియా ఆస్పత్రులలో పర్యటించారు. సీజనల్ కేసులు ఎన్ని ఉన్నాయి, వైద్యులు, సిబ్బంది, నర్సులు, మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉస్మానియా ఆస్పత్రిని తెలంగాణ వైద్య విధాన పరిషత్ అజయ్‌కుమార్, హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటీ సందర్శించారు. ఉదయం 10.30 గంటలకు ఆస్పత్రికి వెళ్లిన అధికారులు మధ్యాహ్నం వరకు వార్డులను తిరిగి ఓపీ, ఐపీలో జ్వరాల కేసులను పరిశీలించారు. డెంగీ, చికున్‌గున్యా, వైరల్ ఫీవర్ల వివరాలు తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి మందులు ఇస్తున్నారా.. చికిత్స సక్రమంగా చేస్తున్నారని అని అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీ, బ్లడ్ బ్యాంక్, బయోమెడికల్‌ను సందర్శించారు. బడ్జెట్, వైద్యుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్, ఆర్ఎంఓ డాక్టర్ జయకృష్ణ పాల్గొన్నారు. గాంధీ ఆస్పత్రిని టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్ సందర్శించారు. అక్కడి పరిస్థితులను సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి ఆయనకు వివరించారు. నిలోఫర్ ఆస్పత్రిని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్వీ కర్ణన్ సందర్శించి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నాంపల్లి ఏరియా, కుత్బుల్లాపూర్ ఆస్పత్రులను కూడా అధికారులు సందర్శించారు.



కళాసీగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు

సంబురంగా బతుకమ్మ వేడుకలు

బౌద్ధనగర్/రాంగోపాల్‌పేట, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): దసరా పండగను పురస్కరించుకుని విద్యార్థులు బతుకమ్మ సంబురాలు జరుకొన్నారు. మంగళవారం కళాసీగూడ ప్రభుత్వ పాఠశాల, సీతాఫల్‌మండిలోని మేడి బావి జ్యోతి మోడల్ స్కూల్‌లో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల ధరించి బతుకమ్మ పాటలు పాడతూ ఆడిపాడారు. ఆయా కార్యక్రమాలలో ప్రధానోపాధ్యాయుడు యాకుబ్ చారి, ఉపాధ్యాయులు భోపాల్, విజయలక్ష్మి, పాఠశాల డైరెక్టర్లు శివ, కాచం రాము, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీ బస్టాండులో ఏడాది చిన్నారి

● విడిచిపెట్టి వెళ్లిపోయిన వృద్ధుడు



అడ్డగుట్ట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జూబ్లీ స్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తులు ఏడాది చిన్నారిని విడిచిపెట్టి వెళ్లిపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేటకు చెందిన హెడ్ కానిస్టేబుల్ గంగుల నరేందర్‌రెడ్డి సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్‌లో గతేడాది నుంచి విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున జూబ్లీ బస్టాండ్‌లోని ప్లాట్‌ఫాం 23 వద్దకు వచ్చిన 60 ఏళ్ల వృద్ధుడు ఏడాది చిన్నారిని తీసుకొని వచ్చాడు. ఇప్పుడే వస్తానని చెప్పి ప్లాట్‌ఫాంపై ఉన్న తోటి ప్రయాణికుడి అప్పగించి వెళ్లిపోయాడు. అతడు ఎంతసేపటికి తిరిగి రాలేదు. ఈ విషయాన్ని గమనించిన కానిస్టేబుల్ నరేందర్‌రెడ్డి వెంటనే చిన్నారిని చేరదీసి మారేడుపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి అప్పగించాడు. ప్రస్తుతం చిన్నారి ప్రభుత్వ సంరక్షణలో ఉంది. పాప తల్లిదండ్రుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుడి మృతి



మృతిచెందిన వ్యక్తి

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆనారోగ్యంతో ప్రయాణికుడు రైల్వేస్టేషన్‌లో మృతిచెందాడు. సికింద్రాబాద్ రైల్వే పోలీసుల కథనం ప్రకారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నంబరు 5 పిల్లర్ నంబరు 25 వద్ద 60 ఏళ్ల వ్యక్తి ఆనారోగ్యంతో చనిపోయి ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని గాంధీ ఆస్పత్రి మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నడుస్తున్నరైల్‌లో నుంచి జారిపడి ఇద్దరి మృతి

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నడుస్తున్న రైల్‌లో నుంచి జారిపడి ఇద్దరు మృతిచెందారు. సికింద్రాబాద్ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ పండరీ తెలిపిన వివరాల ప్రకారం గుండ్లపోచంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం సికింద్రాబాద్ వైపు వస్తున్న రైలులో ప్రయాణం చేస్తున్న 50 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. స్థానికులు గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ అక్కడ మృతిచెందాడు. మరో ఘటనలో మహబూబాద్ మరిపెడల్ మండలం మాలోత్‌తాండకు చెందిన మాలోతు దేవేందర్ (30) మంగళవారం రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలులో సికింద్రాబాద్‌కు వస్తున్నాడు. మేడ్చల్ రైల్వేస్టేషన్ వద్ద ప్రమావశాత్తు కిందపడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడని సికింద్రాబాద్ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రేపటి నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో కనకదుర్గా అమ్మవారు

బౌద్ధనగర్/సికింద్రాబాద్/అమీర్‌పేట, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): దసరా వేడుకలకు ఆలయాలు ముస్తాబు అయ్యాయి. దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరగనున్నాయి. సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకర్గాల పరిధిలోని ఆలయాలను సుందరంగా అలంకరించారు. బౌద్ధనగర్‌లో కనకదుర్గ ఆలయం, సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి ఆలయం, బల్కంపేట ఎల్లమ్మ ఆలయాలలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. మంగళవారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి, ఫౌండర్ ట్రస్టీ సురిటి కామేశ్వర్ మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు వెల్లడించారు. ఈనెల 3వ తేదీ ఉదయం 5.30గంటలకు అహోషేకం, 9.00గంటలకు నవరాత్రోత్సవాల పూజలు, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనము, అఖండ దీపస్థాపన తదితర పూజలు, 9.30గంటలకు అలంకారదర్శనము, 10.30గంటలకు చండీహోమం, సప్తశతి, వేదపారాయణములు, 12.30 గంటలకు మధ్యాహ్నిక పూజ, మహానివేదన, మంత్రపుష్పము, తీర్థప్రసాద వినియోగములు, సాయంత్రం 4.00 గంటల నుంచి రాత్రి 10.00 గంటల వరకు అలంకార దర్శనము ఉంటాయని వారు వివరించారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో జరగనున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను ఈవో బొల్లంపల్లి కృష్ణ, చైర్మన్ సాయిబాబాగౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. బౌద్ధనగర్‌లో కనకదుర్గ ఆలయంలో పదిరోజులపాటు దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ కొట్ల ధరణీధర్ తెలిపారు.



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఈవో కృష్ణ, చైర్మన్ సాయిబాబా గౌడ్

ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో

ఈనెల 3వ తేదీ గురువారం దుర్గామాత అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. 4న (శుక్రవారం) శ్రీగజలక్ష్మీదేవిగా, 5న (శనివారం) శ్రీగాయత్రీదేవిగా, 6వ తేదీ ఆదివారం శ్రీఅన్నపూర్ణాదేవిగా, 7వ తేదీ సోమవారం శ్రీభవానీదేవిగా, 8వ తేదీ మంగళవారం శ్రీరాజరాజేశ్వరీదేవిగా, 9వ తేదీ బుధవారం శ్రీసరస్వతీదేవిగా, 10న(గురువారం) శ్రీమహిషాసుర మర్దినీ దేవిగా, 11వ తేదీ శుక్రవారం శ్రీదుర్గాదేవిగా, 12వ తేదీ శనివారం శ్రీమహాకాళిదేవి గా అమ్మవారి దర్శనం ఉంటుంది.

బౌద్ధనగర్‌లోని కనకదుర్గా ఆలయంలో

3వ తేదీన బాలాత్రిపుర సుందరీదేవీగా, 4న గాయత్రీ దేవీగా, 5న అన్నపూర్ణాదేవీగా, 6న లలితా త్రిపుర సుందరీ దేవీగా, 7న మహాచండీదేవీగా, 8న మహాలక్ష్మీదేవీగా, 9న సరస్వతిదేవీగా, 10న దుర్గాదేవీగా, 11న మహిషాసురమర్దినిదేవీగా, 12వ తేదీన రాజరాజేశ్వరి దేవీ అలంకరణలో దర్శనం ఇవ్వనున్నారు.